10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

శనివారం | 15 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

డి.పోచంపల్లి సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమిలో కూల్చివేతలు..



# రెవెన్యూ కూల్చివేతలు..!

# కొందరిపైనేనా..?

## డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు..

మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో,
పెన్ పవర్, ఫిబ్రవరి 14:

దుండిగల్ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో భారీగా కూల్చివేతలు చేపట్టిన రెవెన్యూ అధికారులను, అభినందించాలి.. కానీ గత అక్టోబర్ నెలలో కూల్చివేసిన నిర్మాణాన్ని మళ్ళి కూల్చివేస్తే ఎందుకు వదిలేశారు..? ఫిబ్రవరి 1న కోర్టు ఆర్డర్ ఉన్న గుడిసెను కూల్చేసిన అధికారులు..! ఒక గదిని మాత్రం ఎందుకు వదిలేశారు.. ఆ కబ్జాదారుడు అంత ఆప్తమిత్రుడా..? భూ పరిరక్షణ పేరుతో రెవెన్యూ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ.. ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తున్నారు.. స్థానిక సిబ్బంది మొదలుకొని.. ఓ జిల్లా ఉన్నతాధికారి వరకు కబ్జాదారులకు సహకరించడం పరిపాటిగా మారింది.. ఉదాహరణకు సర్వే నెం.120/24 ప్రభుత్వ భూమిలో నిర్జన ప్రదేశంలో సిడిపి నిధుల సీసీరోడ్డు నిర్మాణం.. బహదూర్‌పల్లిలో హైకోర్టు పరిధిలో ఉన్న సర్వే నెం.227 ప్రభుత్వ భూమిలోని కమ్మ సఘం భవనానికి రూ.60 లక్షల ఎస్‌డిఎఫ్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టడమే..!



అక్రమ షెడ్డుపై రెవెన్యూ కూల్చివేతలు..

- సుమారు 10 అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన దుండిగల్ రెవెన్యూ అధికారులు..
- గతంలో కూల్చేసిన చోటనే మళ్ళీ నిర్మించిన ఓ అక్రమ కట్టడానికి చర్యల మినహాయింపు..
- బీఆర్ఎస్ భవన్ సమీపంలో.. మల్లంపేట్‌కి చెందిన కబ్జాదారుని సోదరుడి అక్రమ కట్టడం..
- చర్యలు లేవంటే అర్థం..? అధికారులకు ఆమ్యామ్యాలు సమకూర్చే ఆప్తమిత్రుడా..?



-2లో





- ఉన్నతాధికారులు చెప్పేవరకు.. స్థానిక రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నట్లు..?
- ఆ ఒక్క అక్రమ కట్టడాన్ని ఎందుకు వదిలేశారు..? గతంలో కూల్చివేసిందే కదా తెలియదా సారు..!!
- గత అక్టోబర్ నెలలో ఇదే అక్రమ నిర్మాణం కూల్చివేశారు..
- ఇంతలోనే హైకోర్టు ఆర్డర్ అంటూ గోడలపై రాతలు.. చర్యలకు మినహాయింపు..
- ఫిబ్రవరి 1న దుండిగల్ రెవెన్యూ కూల్చివేతల్లోనూ కోర్టు ఆర్డర్ బోర్డు గుడిసెను కూల్చేశారు.. ఎందుకు..
- గుడిసెవాసులకో న్యాయం..! ఇతరులకో న్యాయమా..?కారణం ముడుపులేనా..?
- మల్లంపేటలో 17 ఎ. కబ్జాచేసిన అక్రమార్కుని చెందిన ఈ నిర్మాణాన్ని ఎలా వదిలేస్తారు..?

## తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్చార్జిగా మీనాక్షి నటరాజన్



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా మీనాక్షి నటరాజన్ నియమితులయ్యారు. ప్రస్తుత ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షి నటరాజన్‌ను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ 2025, ఫిబ్రవరి 14న ఆదేశాలు జారీ చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు -3లో

## కేసీఆర్ ఫ్యామిలీకి తెలంగాణలో జీవించే హక్కే లేదు

హైదరాబాద్ పెన్ పవర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పనిపై విపక్షం దుష్ప్రచారం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. కుల గణన, ఎస్సీ వర్గీకరణపై శుక్రవారం (ఫిబ్రవరి 14) గాంధీ భవన్లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన -3లో



# రెవెన్యూ కూల్చివేతలు..! కొందరిపైనేనా..?



గత అక్టోబర్ నెలలో ఇలా..! ఫైల్‌ఫోటో..



వెంటనే కూల్చివేసిన రెవెన్యూ.. ఫైల్‌ఫోటో..



కూల్చివేసిన చోటనే మళ్ళీ నిర్మాణం.. ప్రస్తుతం ఇలా..

## వదిలేసిన అక్రమ నిర్మాణదారుడు.. ఆప్తమిత్రుడా..?

దుండిగల్ రెవెన్యూ అధికారుల చర్యలు ఎప్పుడూ ఓ ప్రత్యేకతను సంతరించుకుంటుంది అనడంలో అతిశయోక్తి కాదు.. శుక్రవారం 10 అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన అధికారులు, ఒక కబ్జాదారుని నిర్మాణానికి మినహాయింపు కల్పించారు.. ఎందుకంటే మల్లంపేట్‌లో పేరుమోసిన కబ్జాదారుడి సోదరుడు కావడమేనని విమర్శలు వస్తున్నాయి.. గండిమైసమ్మలోని బీఆర్ఎస్ భవన్ సమీపంలో సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో గత సంవత్సరం అక్టోబర్ నెలలో పలువురి ఫిర్యాదులతో కూల్చివేశారు.. తాజాగా మళ్ళీ రాత్రికి రాత్రే నిర్మించి హైకోర్టు ఆర్డర్ ఉందని గోడలపై రాసి ఉంచారు.. అందుకే చర్యలు తీసుకోలేదని రెవెన్యూ సిబ్బంది చెబుతున్న సమాధానం.. ఈనెల ఫిబ్రవరి 1న కోర్టు ఆర్డర్ ఉన్న గుడిసెను ఎలా తొలగించారో తహశీల్దార్ సమాధానం చెబుతారని ఆశిద్దాం.

## సర్వే నెంబర్.120 ప్రభుత్వ స్థలంలో కూల్చివేతలు..

మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం, దొమ్మర పోచంపల్లి గ్రామ పరిదిలోని సర్వే నెంబర్ 120/11 ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమనిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు,. ట్రైబల్ వెల్ఫేర్ శాఖకి కేటాయించిన స్థలంలో నిర్మిస్తున్నారని..! పలు దినపత్రికలో వచ్చిన వార్తా కథనాలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు.. శుక్రవారం 4 బేస్‌మెంట్‌లు, 6 రూములను తొలగించారు, ప్రధాన రహదారికీ ఆనుకొని ఏర్పాటు చేసిన కంటైనర్లను తొలగించడంలో వివక్ష చూపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి, సర్వే నంబర్ 120 సాయిపూజా కాలనీ, చంద్రశేఖర్ రెడ్డి నగర్, ప్రభుత్వ భూమిలో నిర్మించిన అనుమతిలేని షెడ్ల తోపాటు, బేస్మెట్లు,రూములు తొలగించారు,ఈ సందర్భంగా తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో అక్రమనిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు.. జీవో నెం.59 పట్టా ఉన్నప్పటికీ, మున్సిపల్ నుండి అనుమతి తప్పని సరిఅని పేర్కొన్నాడు.. సర్వే నెంబర్ 120/11లోని కొంత భూమిని ఉన్నతాధికారుల ఆదేశాలతో ట్రైబల్ వెల్ఫేర్ విభాగానికి కేటాయించినట్లు తెలిపారు, ట్రైబల్ వెల్ఫేర్ ల్యాండ్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జెసిబితో అక్రమనిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు..


ఈనెల 1న హైకోర్టు ఆర్డర్ ఉందని ఫ్లెక్సీ ఉన్నప్పటికీ రెవెన్యూ చర్యలు..ఫైల్‌ఫోటో..

- మొదటి పేజి తరువాయి
అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కన్నెర్ర చేశారు.. అభినందించదగిన విషయమే.. సుమారు 10 అక్రమ కట్టడాలను కూల్చివేసిన అధికారులు.. ఒక కబ్జాదారుని అక్రమ నిర్మాణానికి కూల్చివేయకుండా..! హైకోర్టు ఆర్డర్ సాకుతో చర్యలకు ప్రత్యేక మినహాయింపు కల్పించడం అధికారుల వక్ర బుద్ధిక నిదర్శనం అంటూ ఆరోపిస్తున్నారు.. గత సంవత్సరం అక్టోబర్ నెలలో స్థానికుల ఫిర్యాదులతో కూల్చివేసిన రెవెన్యూ అధికారులు..! అదేచోట మళ్ళీ నిర్మించి హైకోర్టు ఆర్డర్ అంటూ గోడలపై రాసి ఉంచారు.. రాత్రికి రాత్రే నిర్మాణం తెలవారేసరికి కోర్టు ఆర్డర్.. ఆర్డర్ సాకుతో అక్రమ గదిని కూల్చి వేయకుండా వదిలేశారు.. మరి ఈనెల ఫిబ్రవరి 1న ఓ గుడిసెకి కోర్టు ఆర్డర్ ఫ్లెక్సీ ఉన్నప్పటికీ ఎలా కూల్చివేశారు తహశీల్దార్ సారూ.. సదరు అక్రమ నిర్మాణ(120) దారుడి సోదరుడు మల్లంపేట్ సర్వే నెంబర్ 170 ప్రభుత్వ భూమిలో సుమారు 17 ఎకరాలు కబ్జాచేసిన బడా కబ్జాదారునికి సోదరుడు అయినందునే, అధికారులు సహకరించారా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు..

## బంగారం ధరలు ఫస్ట్ టైం ఇంత పెరిగాయ్.. ఇంత రేటు ఉంటే మిడిల్ క్లాస్ జనం.. తులం కూడా కొనలేరేమో..!

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు సరికొత్త రికార్డు సృష్టించాయి. ఫిబ్రవరి 14న ఒక్కరోజే 1300 రూపాయలు పెరిగి ఆల్ టైం హైకి చేరుకున్నాయి. ఫిబ్రవరి 14న ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం (99.5 శాతం ప్యూరిటీ బంగారం) 10 గ్రాముల ధర 89,400 రూపాయలకు పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ రిపోర్ట్ చేసింది. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న టారిఫ్ నిర్ణయాలు, యూఎస్ డాలర్ విలువ బలపడటం, రూపాయి విలువ తగ్గడం.. ఇలా పలు అంశాలు భారత్ లో బంగారం ధర పెరుగుదలకు కారణమవుతున్నాయి. వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. శుక్రవారం రూ.2 వేలు పెరగడంతో కిలో వెండి ధర మళ్లీ లక్ష మార్క్ ను చేరింది.విదేశీ ఇన్వెస్టర్లు ఇండియాలో తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటుండడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల బాటలో పయనిస్తున్నాయి. ఫలితంగా దేశీయ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపడం వల్లే గోల్డ్ రేట్లు పెరుగుతున్నాయి. ఇదే ట్రెండ్ కొనసాగితే.. ముందు ముందు 10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష టచ్ అవడానికి ఎక్కువ టైం పట్టకపోవచ్చు. పెళ్లిళ్ల సమయంలో బంగారం రేట్లు విపరీతంగా పెరగడంతో సామాన్యులు, మధ్య తరగతి జనం బంగారం కొనడానికి నానా తిప్పలు పడ్తున్నారు.

జనవరి 30న మాఘమాసం ప్రారంభమైంది. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 26 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో లక్షలాది పెళ్లిళ్లు, గృహప్రవేశాలు జరగనున్నాయి. తెలుగిండ్లలో బంగారం లేకుండా పెళ్లిళ్లు జరగవనే సంగతి తెలియంది కాదు. ఆయా కుటుంబాలు తాహతును బట్టి పెళ్లి కూతుర్లకు, ఆడపడుచులకు తులాల కొద్దీ బంగారు ఆభరణాలు



కొనడం ఆనవాయితీ. కానీ పెరిగిన గోల్డ్ రేట్లతో వధువు తల్లిదండ్రులు హడలెత్తిపోతున్నారు.

# ప్రైవేటు క్లినిక్‌లలో..! ఎన్‌ఎమ్‌సి ఆకస్మిక తనిఖీలు..

## అర్హత లేకుండా వైద్యం చేస్తున్నట్లు నిర్ధారించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు..!

**దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎమ్సి) ప్రతినిధుల బృందం శుక్రవారం పలు ప్రాంతాలలోని ప్రైవేట్ క్లినిక్‌లలో తనిఖీలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రెండు, దుండిగల్ మున్సిపల్ పరిధి మల్లంపేటలోని నాలుగు, బాచుపల్లి ప్రాంతంలో ప్రైవేటు క్లినిక్‌లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు.. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం శుక్రవారం ప్రైవేట్ క్లినిక్‌లలో తనిఖీలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ, దుండిగల్ మున్సిపల్ పరిధి మల్లంపేటలోని నాలుగు క్లినిక్‌లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ప్రాక్టీస్ పేరుతో ఎలాంటి అర్హతలు లేకుండానే వైద్యశాలలు నిర్వహిస్తూ రోగుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నట్లు గుర్తించారు. ఎంబీబీఎస్ వంటి డిగ్రీలు లేకుండానే అల్లోపతి వైద్యం నిర్వహిస్తూ.. రోగులకు విచ్చలవిడిగా



యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, వ్యాక్సిన్స్, పెయిన్ కిల్లర్స్ ఇస్తున్నట్లు గుర్తించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలో బుచ్చిబాబు క్లినిక్ పేరుతో అరుణ కుమారి అనే నకిలీ వైద్యురాలు ఏకంగా మహిళలకు అబార్షన్లు చేస్తున్నట్లు గుర్తించారు..

# నూతనంగా నియమితులైన ఆర్టీయే (నాన్ ఆఫీసియల్) సభ్యులకు అభినందనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** నూతనంగా నియమితులైన ఆర్టీయే (నాన్ ఆఫీసియల్) సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా నియమైకమైన వారితో సమాచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 24 మందికి ఆర్టీయే సభ్యులుగా అధికారిక నియామక పత్రాలు వచ్చాయని, మిగిలిన వారికి కూడా త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వస్తాయని తెలిపారు. జిల్లాల్లో స్థానిక నాయకత్వం సలహా సూచనల మేరకు నేరుగా మీ వద్దకే నియామక పత్రాలు వచ్చాయని ఆర్టీయే సభ్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్తగా నియామకమైన ఆర్టీయే సభ్యులు రవాణా శాఖ గౌరవాన్ని అభివృద్ధిని ప్రజల సౌకర్యార్థం రవాణా సేవల్లో వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం రవాణా శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు ట్రాఫిక్ అవేర్నెస్ కార్యక్రమాలు తదితర అంశాలను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ వివరించారు. రవాణా శాఖ విధులు మోటారు వాహనాల చట్టం రిజిస్ట్రేషన్ ,పన్ను వసూలు , లైసెన్స్ ,ఫిట్నెస్ , తనిఖీలు ,రోడ్ సేఫ్టీ ,పొల్యూషన్ కంట్రోల్ , మీ సేవా యాప్ (టి యాప్ ) ,ఆర్టీఏ ఎం వాలెట్ , నవంబర్ 16 నుండి అమలు చేస్తున్న ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ ,వెహికిల్ స్క్రాప్ పాలసీ ,ూ నుండి ుఉ గా మార్పు ,ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ , వాహనాల ట్రాకింగ్ పరికరాలు , ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ , తెలంగాణ ఏర్పడిన తరువాత మొదటిసారి రవాణా శాఖకు లోగో ఏర్పాటు ,రోడ్డు భద్రత రవాణా శాఖ మొదటి ప్రాధానత్య తదితర అంశాలను ఖీం నాన్ అఫిసియో సభ్యులకు వివరించారు. గతంలో రోడ్ సేఫ్టీ వీక్ ఉండేదని దానిని నెల రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలులో భాగంగా నెల రోజుల పాటు ప్రతి జిల్లాలో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

రాష్ట్రంలో మొదటిసారి యూనిసెఫ్ సహకారంతో నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో గవర్నర్ చేతుల మీదుగా చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ప్రారంభించారు. రోడ్డు సేఫ్టీ మీద మీ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

# ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**దేవనకొండ ఫిబ్రవరి 14 పెన్ పవర్::** పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చాకలి. కృష్ణ,మండల ఉపాధ్యక్షులు సి.బజారి వై.నాగేశ్వరరావు లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల సమితి (బికెఎంయూ) ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలపై ఏపీడి పక్కిరప్ప మరియు ఏపీవో రాజు నాయక్ లకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వడంలో పాలక ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పని ప్రదేశంలో కనీసం వసతులు కల్పించకపోవడం వల్ల ఉపాధి కూలీలు పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి, 500 రూపాయలు కనీస వేతనం చెల్లించాలన్నారు. గ్రామాలలో వలసల నివారణకు ఉపాధి హామీ పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకునే పేద మధ్యతరగతి కుటుంబాలకు చాలీచాలని వేతనాలు ఉండటంవల్ల తమ పిల్ల పాపలతో సుదూర ప్రాంతాలకు వలసలకు వెళ్లే దుస్థితి దాపురించిందన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం నిర్వీర్యం కాకుండా ఉండాలంటే ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచి, 500 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించిన ఉపాధి కూలీకి 5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలన్నారు. ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు సకాలంలో మంజూరు చేయాలని లేని పక్షంలో ఏపీ వ్యవసాయ

కార్మిక సంఘం ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు భాస్కర్, నరేష్, శంకర్, రఫీ, కోదండ, డేవిడ్, శ్రీనివాసులు, కోదండ రాముడు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్చార్జిగా మీనాక్షి నటరాజన్

- మొదటి పేజి తరువాయి

మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు పలు కేంద్ర పాలిత ప్రాంతాలు, వివిధ రాష్ట్రాలకు ఇంచార్జులు, ప్రధాన కార్యదర్శులను నియమిస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ నియమాకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెలంగాణతో పాటు రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, 9 రాష్ట్రాలకు ఇంచార్జులు, కార్యదర్శులను నియమించింది ఏఐసీసీ. మరికొన్ని రోజుల్లో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ హై కమాండ్ రాష్ట్ర ఇంచార్జ్ ను మార్చడం గమనార్హం. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ గా నియమితులైన మీనాక్షి నటరాజన్.. 2009లో మధ్యప్రదేశ్ లోని మాండసోర్ నుంచి ఎంపీగా గెలిచారు. కాంగ్రెస్ లో కింది స్థాయి నుంచి ఎదిగిన నాయకురాలిగా మీనాక్షి నటరాజన్ కు మంచి పేరుంది. ప్రస్తుతం మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ టీమ్ లో కీలక సభ్యురాలిగా ఉన్నారు. రాహుల్ గాంధీకి సన్నిహితంగా ఉండే నేతను తెలంగాణ ఇంచార్జ్ గా నియమించడం గమనార్హం. 9 రాష్ట్రాల కొత్త ఇంచార్జులు:

## కేసీఆర్ ఫ్యామిలీకి తెలంగాణలో జీవించే హక్కే లేదు

- మొదటి పేజి తరువాయి

కుల గణనకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మొత్తం 5 కేటగిరీల కింద కుల గణన వివరాలు సేకరించామని.. కుల గణన తుది నివేదిక ప్రకారం.. రాష్ట్రంలోని బీసీ జనాభా 56.33 శాతం ఉందని వెల్లడించారు. గతంలో సర్వే చేసి వివరాలు వెల్లడించకుండా దాచిన వారు ఇప్పుడు మమ్మల్ని విమర్శిస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఇప్పటిదాకా ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు.

ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్టంగా, శాస్త్రీయంగా కుల గణన సర్వే చేయించామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ ఫ్యామిలీకి తెలంగాణ సమాజంలో నివసించే హక్కు లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా సర్వేలో పాల్గొనేలా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఇంటి ముందుకు మేలుకొలుపు డప్పు కొట్టండని అన్నారు. కులగణనపై ప్రణాళిక ప్రకారమే ముందుకెళ్తామని స్పష్టం చేశారు. మైనార్టీల లెక్క ఎలా తీశామని కొందరు ప్రశ్నిస్తున్నారు.. బీసీ-ఈ గ్రూప్ కింద 4 శాతం రిజర్వేషన్ ఉంది కాబట్టే మైనార్టీల లెక్క తీశామని క్లారిటీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఒక్కరోజే సర్వే చేసి కాకి లెక్కలు చూపించారని.. కాకి లెక్కలతో సర్వే చేసి.. మా సర్వే తప్పంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే కరెక్ట్ అయితే.. ఎందుకు వివరాలు ఇన్నాళ్లు వెల్లడించలేదని నిలదీశారు. కులగణనపై విపక్షాలది దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సీనియర్ మంత్రులను కుల గణన సర్వేలో సభ్యులుగా చేర్చామని.. కుల గణనపై నిర్దిష్టమైన ప్రణాళిక రచించి ప్లానింగ్ డిపార్ట్మెంట్ కు అప్పగించామని తెలిపారు. మొత్తం లక్షా 4 వేల ప్రభుత్వ అధికారులు సర్వేలో పాల్గొన్నారని.. 3 రోజుల్లో 150 ఇండ్లను సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. 95 వేల యూనిట్లుగా విభజించి 95 వేల మంది ఎన్ రోలర్స్ ని నియమించామని తెలిపారు. మొత్తం 45 రోజుల పాటు సర్వే చేసి రిపోర్టు తయారు చేయించామని చెప్పారు. అధికారులు ఒకటికి 4 సార్లు ప్రతీ ఇంటికి తిరిగి వివరాలు సేకరించారన్నారు. సర్వే వివరాలను కేటీఆర్ లాంటి వాళ్లు తప్పుబడతారని యాజమానుల సంతకాలు తీసుకున్నామన్నారు. అలాగే.. 36 వేల మంది డేటా ఆపరేటర్లతో సర్వేను ఆన్ లైన్ చేయించామని పేర్కొన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్‌కు అలర్ట్.. జంట నగరాలకు తాగు నీళ్లిచ్చే రిజర్వాయర్‌లో.. చచ్చిపడి ఉన్న బర్డ్ ఫ్లూ కోళ్లు..!




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ తాగు నీటి కోసం ఉపయోగించే అక్కంపల్లి రిజర్వాయర్‌లో బర్డ్ ఫ్లూతో మృతి చెందిన వందలాది కోళ్లను పడేశారు. అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి హైదరాబాద్ జంట నగరాలకు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తుంటారు. అలాంటి రిజర్వాయర్‌లో చనిపోయిన కోళ్లు, వాటి వ్యర్థాలు వేశారనే నేపథ్యంలో రిజర్వాయర్‌ను ఇరిగేషన్ అధికారులతో కలిసి దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి పరిశీలించారు. పీఏ పల్లి మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 80 కోళ్లు మృతి చెంది కనిపించాయి. రిజర్వాయర్‌లో చనిపోయిన కోళ్లు ఇంకా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. సెర్చ్ చేయాలని అధికారులకు దేవరకొండ ఆర్డిఓ రమణా రెడ్డి సూచించారు. కోళ్లను ఎవరు వేశారు అనే కోణంలో విచారణ చేపట్టి కేసు నమోదు చేయాలని గుడిపల్లి పోలీసులను ఆర్డీఓ ఆదేశించారు.ఏపీలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కావడంతో సరిహద్దు జిల్లాల్లో ఇప్పటికే టెన్షన్ నెలకొంది. ప్రభుత్వ ఆదేశాలతో ఏపీని ఆనుకొని ఉన్న ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల అధికారులు అప్రమత్తమయ్యారు. సరిహద్దుల్లో 24 చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ పశు సంవర్థక శాఖ సిబ్బందిని నియమించారు. వాహనాలను తనిఖీ చేసిన అనంతరం రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. ప్రత్యేకించి కోళ్లు, కోడి గుడ్లు, కోళ్ల దాణా ఏపీ నుంచి మన రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కోళ్లు, గుడ్లు, దాణాతో ఏవైనా వాహనాలు వస్తే వాటిని తిప్పి పంపిస్తున్నారు. నల్గొండ జిల్లాల్లో వందల సంఖ్యలో చికెన్ షాపులున్నాయి. వాటికి అవసరమైన కోళ్లు, కోడి గుడ్లు, దాణాను వ్యాపారులు ఏపీ నుంచే తీసుకువస్తారు. అలా తీసుకొచ్చిన కోళ్లు బర్డ్ ఫ్లూ సోకి చనిపోయి ఉంటాయని, వాటిని అక్కంపల్లి రిజర్వాయర్ లో వేసి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## సికింద్రాబాద్ లో బ్లాక్ డే

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచం మొత్తం ఫిబ్రవరి 14 ను వ్యాలంటేన్ డే (ప్రేమికులకు రోజుగా)జరుపుకుంటుండగా ఇండియా బ్లాక్ డే గా సెలబ్రేట్ చేసుకోవాల్సి వస్తుందని ఆర్మీ అధికారి నర్సింగ్ రావ్ ఆవేదన వ్యక్తం చేశారు..14 ఫిబ్రవరి 2019 రోజున అదిల్ అహమ్మద్ అనే ఉగ్రవాది ఆత్మాహుతి చేసుకొని 40 మంది ఇండియన్ ఆర్మీ జవాన్లు ప్రాణాలు కోల్పోయిన రోజును బ్లాక్ డే గా జరుపుకోవడం బాధాకరంగా ఉందని ఆర్మీ అధికారి నర్సింగ్ రావ్ తెలిపారు..ఫిబ్రవరి 14 బ్లాక్ డే సందర్భంగా సికింద్రాబాద్ వారాసిగూడ లో ఏం కే ఏం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ డునేట్ క్యాంప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్మీ అధికారి నర్సింగ్ రావ్ హాజరైయ్యారు..ప్రతి ఒక్కరు దేశ భక్తుడిగా మారి సోల్జర్ కావాల్సిన ఆవశ్యకత ఉందని,యువత ఎప్పటి వరకు అయితే అప్పటి ఏమి చేయలేమని, ప్రతి యువకుడు సైనికుడిగా మారి నాడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు..పుల్వామా ఘటన లో 40 మంది ఇండియన్ ఆర్మీ సైనికులను కోల్పోవడం కారణంగా ఫిబ్రవరి 14 రోజును బ్లాక్ డే గా జరుపుకుంటూ ప్రతి సంవత్సరం బ్లడ్ డునెట్ కార్యాక్రమం చేస్తున్నామని ఏం కే ఏం ఫౌండేషన్ ఫౌండర్ మెంబర్ మురళీ క్రిష్ణ తెలిపారు.. ఆరోజున 40 మంది సి ఆర్ పి ఎఫ్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు కనుక 400 మందికి బ్లడ్ డునెట్ చేస్తే 40 మందికి గాను 400 మంది ఇండియన్ ఆర్మీకి వెళ్తారని మా చిన్న మోటో అని మురళీ క్రిష్ణ తెలిపారు.

# చంద్రబాబు, కేసీఆర్ వచ్చింది యూత్ కాంగ్రెస్ నుంచే.. అది యూత్ కాంగ్రెస్ పవర్: సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** చంద్రబాబు, కేసీఆర్ యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారని.. వీరితో పాటు పార్టీలోని అగ్ర నాయకులు అంతా యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని.. అది యూత్ కాంగ్రెస్‌కు ఉన్న పవర్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ బలం, బలగమని.. యూత్ కాంగ్రెస్ శక్తి ఏమిటో మాకు తెలుసని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. శుక్రవారం (ఫిబ్రవరి 14) గాంధీభవన్‌లో తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది.

తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మిట్టపలి వెంకటేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టపడి పని చేస్తే పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని.. అనిల్ యాదవ్, బల్మూరి వెంకటే ఇందుకు నిదర్శమని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వీరిద్దరికి పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. కొందరు పదవులు రావడం లేదని నిరాశ చెందుతున్నారు.. టైమ్ వచ్చినప్పుడు అవకాశాలు వస్తాయి.. ఎవరూ పోరాటం ఆపొద్దని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

**కేసీఆర్ మోసం చేస్తే మనకు అధికారం**

దేశంలో ఏ ప్రభుత్వం చేయనంత రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసి చూపించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం.. భూమి లేని వ్యవసాయ కూలీలకు రైతు ఆత్మీయ భరోసా కింద ర.12 వేలు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవం కోసం ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూమ్ పేరుతో కేసీఆర్ ఊరించి మోసం చేశారని.. ఆయన మోసం చేశారు కాబట్టే ప్రజలు మనకు అధికారం ఇచ్చారని అన్నారు.

ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని.. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ దేనని అన్నారు. మాకు పాలనే సరిపోతుందని.. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మీరే తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు పదవి ఇస్తామన్నారు. డబ్బులతోనే గెలిచే అవకాశం ఉంటే.. కేసీఆర్ 100 సీట్లు గెలిచే వారని.. సొమ్ముతోనే ఎన్నికల్లో గెలుస్తామనే భ్రమ వీడండని సూచించారు. ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడండని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలిచే విధంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు.

# వీకెండ్ కదా.. బీరేసి చిల్ అవుతారా.. ఒక్కసారి ఈ రేట్లు చూడండి..!

**తెలంగాణలో పెరిగిన బీర్ల ధరల వివరాలు:**

- కింగ్ ఫిషర్ లైట్ బీర్-రూ.180, కింగ్ ఫిషర్ లైట్ చిన్న బీర్-రూ.120
- కింగ్ ఫిషర్ స్ట్రాంగ్ బీర్-రూ.190
- కింగ్ ఫిషర్ అల్ట్రా బీర్-రూ.250
- కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్ బీర్-రూ.260
- కింగ్ ఫిషర్ అల్ట్రా వైట్ బీర్-రూ.370
- హైన్ కెన్ బీర్-రూ.270
- గ్రీన్ బీర్‌రూ.180
- బడ్ వైజర్ బీర్-రూ.250, బడ్ వైజర్ చిన్న బీర్-రూ.140
- బడ్ వైజర్ మ్యాగ్నమ్ బీర్-రూ.260
- హేవర్డ్స్ 5000 బీర్-రూ.190
- నాక్ ఔట్-రూ.190
- ట్యూబర్గ్ లైట్-రూ.180
- ట్యూబర్గ్ స్ట్రాంగ్-రూ.190
- ట్యూబర్గ్ క్లాసిక్-రూ.260
- కార్ల్స్ బర్గ్ స్మూత్-రూ.230
- కార్ల్స్ బర్గ్ స్ట్రాంగ్-రూ.220
- బీరా బ్లండ్ బీర్-రూ.250
- బీరా గోల్డ్ వీట్-రూ.330
- బీరా రైజ్-రూ.260



**హైదరాబాద్ పెన్ పవర్:** వీకెండ్ వచ్చిందంటే చాలు. మద్యం ప్రియులకు పండగ రోజు వచ్చినట్టే. ఉద్యోగులు వారంలో ఐదు రోజులు ఆఫీస్‌లో పడిన ఆపసోపాలన్నింటినీ, వ్యాపారులైతే బిజినెస్‌లో లాభనష్టాలను లైట్ తీసుకుని చిల్ మూడ్‌లో ఉంటుంటారు. ఫ్యామిలీతో సినిమాలు, షికార్లతో ఎంజాయ్ చేస్తూ గడిపేది కొందరైతే, ఫ్రెండ్స్‌తో వీకెండ్ పబ్‌లకు, పార్టీలకు వెళ్లి చిల్ అయ్యేది మరికొందరు. కానీ.. ఈ వీకెండ్ అలా చిల్ అవ్వాలని చూస్తున్న మద్యం ప్రియులకు తెలంగా ణలో పెరిగిన బీర్ల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. బీర్లు కేసులు కేసులు తాగే మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పడటం ఖాయంగా కనిపిస్తోంది. చిన్న బీర్లు, పెద్ద బీర్లు అనే తేడా లేకుండా, ఈ బ్రాండూ.. ఆ బ్రాండనే వ్యత్యాసం లేకుండా బీర్ల ధరలు భారీగా పెరిగాయి.

కింగ్ ఫిషర్ బీర్లు మొదలుకుని బడ్‌వైజర్ బీర్ల దాకా అన్ని బ్రాండ్ల బీర్ల ధరలు పెరిగాయి. హైదరాబాద్‌లో వైన్ మార్ట్, లిక్కర్ బ్యాంక్ వంటి లిక్కర్ స్టోర్స్ లోపల పెరిగిన బీర్ల ధరల బోర్డును పెట్టేశారు. ఎంత పెరిగిందో, ఏంటో అనే గందరగోళానికి తావు లేకుండా బీరు ప్రియులు ఈ బోర్డు మీద ఉన్న ధరలు చూసి డిసైడ్ అవ్వొచ్చు. ఏ బీరు తాగాలో, అసలు ఏ బీరూ కొనకుండా జేబులో చేతులు పెట్టుకుని నడుచుకుంటూ బయటకు వెళ్లిపోవాలో మద్యం ప్రియులు ఈ బోర్డ్ చూసి ఫిక్స్ అవ్వొచ్చు. తెలంగాణ అంతటా దాదాపు ఇవే రేట్లు వర్తిస్తాయి. ఒక్కసారి ఈ బోర్డుపై ఉన్న బీర్ల ధరలు చూద్దాం..

రానున్నది వేసవికాలం కావడంతో బీర్ల సేల్స్ మరింత పెరగనున్నాయి. దీనికి తోడు ఐపీఎల్ కూడా రానుంది. దీంతో ఖజానాకు మరింత ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి రాష్ట్రంలో మద్యం ధరలు పెంచొద్దని ముందుగా నిర్ణయం తీసుకున్నప్పటికీ.. పక్క రాష్ట్రాల్లో ధరలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. బీర్ల రేట్లు పెరగడంతో ప్రతినెలా దాదాపు రూ.300 కోట్ల వరకు అదనంగా ఆదాయం వస్తుందని ఎక్సైజ్ అధికారులు అంచనాల్లో ఉన్నారు.

# మోదీ విమానం వెనకే వచ్చేస్తున్నాయ్: మరో 2 విమానాల్లో వలసదారులను పంపించేస్తున్న అమెరికా

**హైదరాబాద్ పెన్ పవర్:**మన ప్రధాని మోదీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీ ముగిసిన వెంటనే.. అగ్రదేశం సంచలన నిర్ణయం తీసుకున్నది. అమెరికాలోని ఇండియాకు చెందిన అక్రమ వలసదారులను.. రెండు ప్రత్యేక విమానాల్లో ఇండియాకు పంపిస్తున్నట్లు ప్రకటించింది. ఈ రెండు విమానాలు రేపు, ఎల్లుండి అంటే.. 2025, ఫిబ్రవరి 15, 16 తేదీల్లో అమృత్ సర్ లో ల్యాండ్ కానున్నాయి.




అమెరికా పర్యటన ముగించుకుని ఇండియా బయలుదేరిన మోదీ విమానం వెనకే.. అక్రమ వలసదారుల రెండు విమానాలు వరసగా బయలుదేరేలా పరిస్థితులు ఉండటం చర్చనీయాంశం అయ్యింది. ట్రంప్‌తో ప్రధాని మోదీ సమావేశం తర్వాత అయినా వలసదారులపై అమెరికా వైఖరి మారొచ్చనే చర్చ జరిగింది. అలాంటిది ఏమీ లేకుండా.. అమెరికా నుంచి మోదీ బయలుదేరిన వెంటనే.. ఆయన విమానం వెనక.. మరో రెండు విమానాల్లో మనోళ్లను ఇండియాకు పంపించాలని అమెరికా డిసైడ్ కావడం చర్చనీయాంశంగా మారింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చాక అక్రమ వలసదారుల తరలింపే లక్ష్యంగా ముందుకెళుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అమెరికా యుద్ధ విమానంలో భారత్ లోని అమృత్ సర్ కు అక్రమ వలసదారులను డొనాల్డ్ ట్రంప్ పంపించేశారు. అమెరికా నుంచి అక్రమ వలసదారులతో కూడిన ఫస్ట్ బ్యాచ్ విమానం భారత్ చేరిన రోజుల వ్యవధిలోనే మరో రెండు విమానాలు అమెరికా నుంచి భారత్ కు అక్రమ వలసదారులతో వస్తుండటం గమనార్హం.

టెక్సాస్ నుంచి వచ్చిన సీ-17 మిలటరీ ప్లేన్ పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న శ్రీ గురు రామ్‌దాస్ జీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో బుధవారం(ఫిబ్రవరి 5, 2025) మధ్యాహ్నం 1.55 గంటలకు ల్యాండ్ అయింది. అందులోని 104 మందిలో పంజాబ్‌కు చెందినవారు 30 మంది, హర్యానా, గుజరాత్‌కు చెందినవారు 33 మంది చొప్పున ఉన్నారు.

అమెరికా గడ్డపై విదేశీ పౌరులకు పుట్టే పిల్లలకు ఇకపై ఆటోమేటిక్ సిటిజన్‌షిప్ వర్తించబోదంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో అక్కడి ఇండియన్లు తీవ్ర ఆందోళనలో పడిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 20 నుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి రానుండటంతో ఆలోపే సిజేరియన్ ఆపరేషన్ చేయించుకుని అయినా పిల్లలను కనాలని ప్రస్తుతం గర్భం దాల్చినవారు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

డెడ్‌లైన్ కంటే ముందే డెలివరీకి ప్లాన్ చేసుకుంటున్నారు. ఇలా ముందస్తు డెలివరీల కోసం వస్తున్న వారిలో ఎక్కువ మంది ఇండియన్లే ఉన్నారని న్యూజెర్సీలోని ఓ మెటర్నిటీ క్లినిక్ డాక్టర్ ఎస్‌డీ రమా తెలిపారు. బర్త్ రైట్ సిటిజన్ షిప్ పై ట్రంప్ ప్రకటన తర్వాత.. ప్రీ టర్మ్ బర్త్ కోసం చాలా కాల్స్ వస్తున్నట్లు చెప్పారు. ఏడు నెలల గర్భిణులు కూడా సిజేరియన్ చేయాలని కోరుతున్నారని తెలిపారు.

# తెలంగాణపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు... వినోద్ కుమార్ కౌంటర్

- **నిర్మలా సీతారామన్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారన్న వినోద్ కుమార్**
- **ఏపీ పునర్విభజన చట్టం వచ్చిందే తెలంగాణ కోసమని వెల్లడి**
- **కేసీఆర్ అప్పులు తెచ్చి ఆస్తులను సృష్టించారన్న వినోద్ కుమార్**




**హైదరాబాద్ పెన్ పవర్:**విభజన తర్వాత తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఉందని, ఆ తర్వాత పదేళ్లలో అప్పుల కుప్పగా మారిందన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలకు బీఆర్ఎస్ సీనియర్ నేత వినోద్ కుమార్ కౌంటర్ ఇచ్చారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నిన్న రాజ్యసభలో బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసమే పునర్విభజన చట్టం వచ్చిందని, ఈ చట్టంతో సీతారామన్‌కు గానీ, ఇప్పటి బీజేపీ ప్రభుత్వానికి గానీ సంబంధం లేదన్నారు.

తెలంగాణ ప్రజలు, గులాబీ జెండా కలిసి ఈ చట్టాన్ని సాధించుకున్నారని ఆయన అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనను నిర్మలా సీతారామన్ చాలా చులకనగా మాట్లాడారని మండిపడ్డారు. తెలంగాణను 1956లో ఆంధ్రాతో కలిపినప్పుడే మిగులు బడ్జెట్‌గా ఉందని, అలాగే 2014లోనూ అలాగే ఉందని వినోద్ కుమార్ అన్నారు. కేసీఆర్ అప్పులు తీసుకొచ్చి ఒక్క రూపాయి కూడా వృథా చేయలేదన్నారు. ఆస్తులను సృష్టించినట్లు చెప్పారు.జిల్లా కలెక్టరేట్లు, కాళేశ్వరం ప్రాజెక్టు, రేవంత్ రెడ్డి కూర్చుంటున్న కమాండ్ కంట్రోల్ రూం... ఇవన్నీ కేసీఆర్ కట్టినవే అన్నారు. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీని నిర్మించినట్లు చెప్పారు. మెదక్ రైల్వే స్టేషన్ కట్టామని బీజేపీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ అది ఎన్నో ఏళ్ల తర్వాత పూర్తయిందని ఆయన అన్నారు. తెలంగాణ చేసిన అప్పుల గురించి మాట్లాడిన కేంద్ర ఆర్థికమంత్రి గొప్పల గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణకు సొంత రాబడి ఐదు రెట్లు పెరిగినట్లు ఆమె ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. నిర్మలా సీతారామన్ రెండు రోజులు తెలంగాణ పర్యటనకు వస్తే ఇక్కడ జరిగిన అభివృద్ధి తెలుస్తుందని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణను బద్నాం చేస్తున్నారని, నిన్న నిర్మలా సీతారామన్ కూడా అలాగే బద్నాం చేసేలా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మలా సీతారామన్ వెనుక తెలంగాణ వ్యతిరేక శక్తులు ఉన్నాయని అన్నారు. ఆమె తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# యాసిడ్ దాడి ఘటన.. కఠిన చర్యలకు సీఎం చంద్రబాబు ఆదేశం.. బాధితురాలికి అండగా ఉంటామన్న మంత్రి లోకేశ్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీలోని అన్నమయ్య జిల్లాలో ఓ యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. గుర్రంకొండ మండలంలోని ప్యారంపల్లె గ్రామానికి చెందిన యువతిపై జరిగిన ఈ దాడిని సీఎం చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. బాధిత యువతికి, ఆమె ఫ్యామిలీకి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. అటు ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య సాయం అందించి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఆమె పట్ల అత్యంత పాశవికంగా వ్యవహరించిన నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని మంత్రి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# తెలంగాణ ఉద్యమంపై లోతైన చర్చ జరగాలి: రేవంత్ రెడ్డి

### దేవేందర్ గౌడ్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి

### తెలంగాణ ఉద్యమంపై సమగ్రమైన పుస్తకాలు రావాలన్న రేవంత్ రెడ్డి

### ఉద్యమంలో దేవేందర్ గౌడ్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఉద్యమంపై లోతైన చర్చ జరగాలని, ఉద్యమంలో ఎన్నో వర్గాలు పాల్గొన్నప్పటికీ ఒక కుటుంబమే పాల్గొన్నట్లు వక్రీకరించారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మాజీ ఎంపీ దేవేందర్ గౌడ్ రచించిన ‘విజయ తెలంగాణ’ పుస్తకాన్ని హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంపై సమగ్రమైన పుస్తకాలు రావాలని ఆయన అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో దేవేందర్ గౌడ్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని వ్యాఖ్యానించారు. ఆయన తన రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. గోదావరి జలాలు తెలంగాణలో పారించేందుకు ఆయన ఉద్యమించారని గుర్తు చేశారు. ఉద్యమం సమయంలో ప్రజలంతా ‘టీజీ’ అని రాసుకున్నారని, అందుకే ‘టీఎస్’గా ఉన్న పేరును ‘టీజీ’కి మార్చామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## తమ్ముడు తమ్ముడే పేకాట.. పేకాటే..! ఇదీ ట్రంప్ లెక్క



హైదరాబాద్ పెన్ పవర్:భారత్, అమెరికా ఎంత మిత్ర దేశాలైనా పన్నుల దగ్గరకు వచ్చే సరికి తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే అంటున్నారు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్. పరస్పర పన్నుల విషయంలో తగ్గేదేలే అని సున్నితంగా తేల్చేశారు. రెసిప్రోకల్ టారిఫ్‌లపై చర్చ సందర్భంగా ట్రంప్ స్పందిస్తూ.. భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను సమర్థించుకొన్నారు. తమది రెసిప్రోకల్ నేషన్ (ఎదుటి దేశం ఎలా స్పందిస్తే.. అలానే ప్రతిస్పందించే దేశం) అని చెప్పారు. అది ఏ దేశమైనా సరే మాపై తక్కువ పన్నులు విధిస్తే.. తాము కూడా అలానే టారిఫ్‌లు వేస్తామన్నారు. భారత్ తమపై ఎంత శాతం పన్ను విధిస్తే.. తామూ అంతే ఛార్జి చేస్తామని అన్నారు.తమకు ఐరోపా అత్యంత సమస్యాత్మకమని చెప్పారు. ఎవరూ కనీవినీ ఎరుగని స్థాయిలో తమపై దిగుమతి పన్నులు విధిస్తున్నారని చెప్పారు. వారు చాలా విషయాల్లో అడ్వాంటేజ్ తీసుకొంటున్నారని వివరించారు. ఇండియాలో టారిఫ్‌లు చాలా ఎక్కువన్నారు. భారత్ ఎంత మొత్తం సుంకం విధిస్తుందో తామూ అంతే విధిస్తామని చెప్పారు. భారత్ లో సుంకాలు ఎక్కువగా ఉండడం వల్ల అమెరికా ఉత్పత్తులు ఎగుమతి కావడం లేదని, దాంతో అమెరికాకు నష్టం జరుగుతోందని ట్రంప్ అన్నారు.

## మరో 200 మంది అక్రమ వలసదారులను భారత్ కు తిప్పి పంపిస్తున్న అమెరికా

- అక్రమ వలసదారులపై ట్రంప్ సర్కారు ఉక్కుపాదం
- గొలుసులతో బంధించి మరీ స్వదేశాలకు పంపిస్తున్న అమెరికా
- ఇటీవల 104 మందితో భారత్ వచ్చిన అమెరికా విమానం
- ఈ నెల 15, 16 తేదీల్లో భారత్ చేరుకోనున్న మరో రెండు విమానాలు



హైదరాబాద్ పెన్ పవర్:అమెరికాలో అక్రమ వలసదారుల అంశంపై ట్రంప్ సర్కారు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. గొలుసులతో బంధించి మరీ అక్రమ వలసదారులను వారి స్వదేశాలకు తిప్పి పంపిస్తున్నారు. కొన్నిరోజుల కిందటే 104 మంది భారతీయులను కూడా అమెరికా ప్రభుత్వం సైనిక రవాణా విమానంలో పంపించి వేసింది.

తాజాగా, మరో 200 మంది అక్రమ వలసదారులను అమెరికా ప్రభుత్వం భారత్ కు పంపించనుంది. అక్రమ వలసదారులతో కూడిన రెండు విమానాలు భారత్ చేరుకోనున్నాయి. ఈ నెల 15న ఒక విమానం, ఈ నెల16న మరో విమానం భారత్ చేరుకుంటాయి.

# ఆరు రోజుల్లో లక్ష దరఖాస్తులు.. రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల ముందు భారీ క్యూ

**తెలంగాణలో రేషన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు**


**ప్రజా పాలన సభలలో 40 లక్షలు.. మీ సేవ కేంద్రాల్లో లక్ష**

**అప్లికేషన్ ఫీజుగా రూ.150 వసూలు చేస్తున్న నిర్వాహకులు**




హైదరాబాద్ పెన్ పవర్:కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకుంటుండడంతో జనం భారీగా అప్లై చేస్తున్నారు. ఈ నెల 7 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. ఎన్నికల కమిషన్ జోక్యంతో మధ్యలో తాత్కాలికంగా బ్రేక్ పడింది. మొత్తంగా ఆరు రోజుల వ్యవధిలో 1.01 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికీ మీ సేవా కేంద్రాల్లో రద్దీ కొనసాగుతోందని, ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో జనం క్యూ కడుతున్నారని చెప్పారు. ప్రజాపాలన సభలలో ఇప్పటి వరకు 40 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో జనం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దరఖాస్తులు స్వీకరించడం మొదలు పెట్టడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు అప్లై చేసుకుంటున్నారు. మీ సేవా కేంద్రాల్లో భారీగా రద్దీ ఏర్పడుతోంది. కొన్నిచోట్ల సాంకేతిక కారణాల కారణంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆలస్యమవుతోందని అధికారులు తెలిపారు. అయినప్పటికీ జనం వేచి ఉండి దరఖాస్తులు ఇచ్చాకే వెళుతున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ అప్‌డేట్, కొత్త రేషన్ కార్డుల కోసం పెద్ద సంఖ్యలో జనం మీ సేవా కేంద్రాలకు వెళుతున్నారు. ఉదయం 6 గంటల నుంచే క్యూ కడుతున్నారు. జనం భారీగా వస్తుండడంతో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు దోపిడీకి తెరలేపారు. ప్రతి దరఖాస్తుకు ఫీజుగా రూ.45 తీసుకోవాల్సి ఉండగా కొన్ని కేంద్రాల్లో రూ.150 వరకు వసూలు చేస్తున్నారని జనం ఆరోపిస్తున్నారు. దీంతో పలు మీ సేవా కేంద్రాల వద్ద అధికారులు నిఘా పెట్టారు. నిర్ణయించిన ఫీజు కన్నా ఎక్కువ వసూలు చేస్తున్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

# వీటితో ఇన్సులిన్ సెన్సిటివిటీ... షుగర్ లెవల్స్ కంట్రోల్!




హైదరాబాద్ పెన్ పవర్: ఇటీవలి కాలంలో చాలా మంది షుగర్ తో బాధపడుతున్నారు. షుగర్ వ్యాధికి లోనవకున్నా... ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్ వంటి వాటితో త్వరలోనే మధుమేహం బారిన పడే అవకాశం ఉన్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి వారి శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీ తగ్గిపోతూ ఉంటుంది. దానివల్ల తగిన స్థాయిలో ఇన్సులిన్ ఉత్పత్తి అయినా కూడా రక్తంలో షుగర్ స్థాయిలు నియంత్రణలో ఉండవు. అలాంటి వారు కొన్ని రకాల ప్రొటీన్లు ఉండే ఆహార పదార్థాలను తీసుకుంటే... శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

**ఎండు బీన్స్...**

ఒక కప్పు ఎండు బీన్స్ లో ఏకంగా 15 గ్రాముల ఫైబర్ ఉంటుందని, ఇందులో అధికంగా ఉండే ప్రొటీన్లతో శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పైగా వీటి గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువని, మధుమేహం ఉన్నవారు కూడా తీసుకోవచ్చని వివరిస్తున్నారు.

**చిక్ పీ (శనగలు)...**

నల్ల శనగలు, పచ్చ శనగలు, కాబూలీ శనగలు... ఇలా ఏవైనా సరే ప్రొటీన్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. వీటితోపాటు రెసిస్టెంట్ స్టార్చ్ కూడా ఎక్కువేనని... ఇవి ఆహారం జీర్ణమయ్యే వేగాన్ని తగ్గిస్తాయని, శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

**చియా సీడ్స్...**

చియా సీడ్స్ ఎన్నో పోషక విలువలకు కేంద్రం. ముఖ్యంగా ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, ఫైబర్, ప్రొటీన్లు ఎక్కువ. ఇవి రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రణలో ఉండేలా చూస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**టోఫు పనీర్...**

సోయా బీన్స్ నుంచి తయారు చేసే 'టోఫు' పనీర్ కూడా కార్బోహైడ్రేట్లు తక్కువగా, ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉండే అద్భుత ఆహారమని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో కండరాల పనితీరు మెరుగుపడటానికి, షుగర్ స్థాయిలు నియంత్రణలో ఉండటానికి ఇవి దోహదం చేస్తాయని వివరిస్తున్నారు.

**క్వినోవా...**

మన శరీరానికి అవసరమైన అన్ని రకాల అమైనో యాసిడ్లు ఉండే పూర్తి స్థాయి ప్రొటీన్ ఫుడ్ క్వినోవా అని నిపుణులు చెబుతున్నారు. ఇందులో అధికంగా ఉండే ఫైబర్, ప్రొటీన్ పదార్థాలు... రక్తంలో షుగర్ స్థాయిలు నియంత్రణలో ఉండేందుకు తోడ్పడుతాయని పేర్కొంటున్నారు.

# రూ.7 కోట్ల ప్యాకేజీతో ప్రమోషన్.. కానీ ఏం లాభం జీవితంలో ఓడిపోయానంటున్న టెకీ




**హైదరాబాద్ పెన్ పవర్:**'కెరీర్ లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మూడేళ్ల పాటు నిరంతరం శ్రమించా.. ఎట్టకేలకు నా గోల్ సాధించా. రూ.7.8 కోట్ల ప్యాకేజీతో ప్రమోషన్ అందుకున్నా.. కానీ నాకు సంతోషంగా లేదు' అంటూ ఓ సాఫ్ట్ వేర్ ఎగ్జిక్యూటివ్ చేసిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఓ చేతికి ప్రమోషన్ లెటర్, మరో చేతికి విడాకుల నోటీస్ అందుకున్నానంటూ వాపోతున్నాడు. పేరుతో పాటు ఇతరత్రా వ్యక్తిగత వివరాలు వెల్లడించకుండా తన ఆవేదనను ఈ పోస్టులో వివరించాడు. మూడేళ్ల కిందట తాను ఓ కంపెనీలో సీనియర్ లెవల్ ఎగ్జిక్యూటివ్ గా చేరానని పోస్టులో చెప్పుకొచ్చాడు. ప్రమోషన్ కోసం రోజుకు 14 గంటలు పనిచేశానని వివరించాడు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిరంతరం మీటింగ్ లతో బిజీబిజీగా ఉండేవాడినని చెప్పాడు. ఈ క్రమంలో తన కూతురు పుట్టిన సమయంలో భార్య పక్కన ఉండే అవకాశాన్ని వదులుకున్నట్లు వివరించాడు. ఆ సమయంలోనూ తాను వర్క్ లో మునిగిపోయానని, ప్రసవం తర్వాత తన భార్య మానసికంగా ఒడిదుడుకులకు గురైందని చెప్పాడు. కౌన్సిలింగ్ కోసం డాక్టర్ ను కలిసేందుకు భార్య వెళితే తాను తోడుగా వెళ్లలేదన్నాడు. బంధుమిత్రులను కలవడం, శుభకార్యాలకు హాజరు కావడం వంటివన్నీ త్యాగం చేసి ఉద్యోగానికే అంకితమయ్యానని వివరించాడు. మూడేళ్ల తర్వాత తనకు ప్రమోషన్ వచ్చిందని, రూ.7.8 కోట్ల వార్షిక వేతనం అందుకోబోతున్నానని తెలిపాడు. అయితే, భార్య తనతో కలిసి ఉండేందుకు ఇష్టపడటంలేదని, విడాకులు కోరుతోందని చెప్పాడు. ఏ ప్రమోషన్ కోసం అయితే, మూడేళ్లు కష్టపడ్డానో అదే తన వ్యక్తిగత జీవితంలో మంట పెట్టిందని వాపోతున్నాడు. ఈ పోస్టుపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కూతురు పుట్టబోతుందని తెలిసీ ఆ క్షణాన్ని ఆస్వాదించకుండా ఉద్యోగ విధుల్లో మునిగిపోవడమేంటని విమర్శిస్తూ చాలామంది కామెంట్లు పెడుతున్నారు.

# తలపై కత్తితో పొడిచి.. నోట్లో యాసిడ్ పోసి.. ఏపీలో యువతిపై అత్యాచారం

- అన్నమయ్య జిల్లాలో ఘోరం
- తన ప్రేమను కాదన్నదనే కోపంతో అఘాయిత్యం
- ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న బాధితురాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రేమ పేరుతో తమ కూతురును ఓ యువకుడు వేధిస్తుండడంతో తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి నిశ్చయం చేశారు. పెళ్లి చేసి పంపిస్తే కూతురు సంతోషంగా ఉంటుందని భావించారు. అయితే, ఆ యువకుడు పగతో తమ కూతురు జీవితాన్ని నాశనం చేస్తాడని ఊహించలేకపోయారు. ఏపీలోని అన్నమయ్య జిల్లా ప్యారంపల్లె గ్రామంలో ఓ యువతిపై ఘోరంగా అత్యాచారం జరిగింది. ప్రేమిస్తున్నానంటూ కొంతకాలంగా వేధిస్తున్న యువకుడే ఈ దారుణానికి పాల్పడ్డాడు. అత్యంత పాశవికంగా బాధితురాలి నోట్లో యాసిడ్ పోసి, తలపై కత్తితో పొడిచాడు. బాధతో అరుస్తున్నా కనికరించకుండా దారుణంగా అత్యాచారం చేసి పారిపోయాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంకొండ మండలంలోని ప్యారంపల్లె గ్రామానికి చెందిన యువతిని అమ్మచెరువు మిట్టకు చెందిన గణేష్ వేధింపులకు గురిచేశాడు. ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండేవాడు. ఈ విషయాన్ని ఆ యువతి తన తల్లిదండ్రులకు చెప్పింది. పెళ్లీడుకు వచ్చిన కూతురు అభాసుపాలవుతుందనే భయంతో తల్లిదండ్రులు ఆమెకు సంబంధం కుదిర్చి ఏప్రిల్ 29 న పెళ్లి నిశ్చయం చేశారు. ఈ విషయం తెలుసుకున్న గణేష్ ఆ యువతిపై కోపం పెంచుకున్నాడు. ఒంటరిగా వెళుతున్న సమయం చూసి యువతిపై దాడి చేశాడు. కత్తితో తలపై పొడిచి, నోట్లో యాసిడ్ పోశాడు. దారుణంగా అత్యాచారం చేసి పారిపోయాడు. యువతిని గమనించిన స్థానికులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించి బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితురాలు చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

## అనంత్ - రాధికల వివాహ వేడుకలపై విమర్శలు.. తాజాగా స్పందించిన నీతా అంబానీ




**హైదరాబాద్ పెన్ పవర్:**తమ కుమార్తె లేదా కుమారుడి పెళ్లిని అంగరంగ వైభవంగా జరిపించాలని ప్రతి తల్లిదండ్రీ కోరుకుంటారని, తాము కూడా తమ పిల్లల విషయంలో అదే చేశామని నీతా అంబానీ చెప్పారు. అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహ వేడుకలను అత్యంత ఆడంబరంగా నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమైన విషయం తెలిసిందే. గతేడాది జరిగిన అనంత్, రాధిక పెళ్లి వేడుకలను ముఖేశ్ అంబానీ, నీతా అంబానీ రోజుల తరబడి నిర్వహించారు. రెండుసార్లు ప్రీ వెడ్డింగ్ జరపడంతో పాటు పెళ్లికి హాలీవుడ్ నటులతో పాటు పలువురు సెలబ్రిటీలతో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దీనిపై అప్పట్లోనే విమర్శలు రాగా అంబానీ దంపతులు స్పందించలేదు. తాజాగా బ్లూమ్ బర్గ్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నీతా అంబానీ ఈ విమర్శలపై స్పందించారు. అనంత్ పెళ్లిని ఆడంబరంగా నిర్వహించారనే విమర్శలు మీకు ఇబ్బందిగా అనిపించాయా? అన్న ప్రశ్నకు నీతా అంబానీ జవాబిచ్చారు. 'పిల్లల పెళ్లి విషయంలో ప్రతి తల్లిదండ్రీ తమకు తోచిన విధంగా ఉత్తమంగా చేయాలనుకుంటారు. మేము కూడా అదే చేశాం. అనంత్ పెళ్లి మేడ్ ఇన్ ఇండియా బ్రాండ్ అని భావిస్తున్నా' అని చెప్పారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఒకే వేదికపైకి తీసుకురాగలిగామని అన్నారు. ఈ విషయంలో తాము ఎంతో సంతోషంగా ఉన్నామని వివరించారు.

## బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నిర్వాకం

**హైదరాబాద్ పెన్ పవర్:**బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ చేసిన నిర్వాకానికి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. 2024 లో ఇంటర్మీడియట్ పాస్ అయిన 60 మంది పైగా విద్యార్థులకు ఇంటర్మీడియట్ మెమోలలో ఫోటోలు తప్పుగా వచ్చాయి. ఈ విద్యార్థులంతా ప్రభుత్వ బిసి వెల్ఫేర్ జ్యోతిరావు పూలే కళాశాలకు చెందిన విద్యార్థులే. నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలోని ఉయ్యాలవాడ బిసి వెల్ఫేర్ జ్యోతిరావు పూలే కోడేరు బీసీ వెల్ఫేర్ జ్యోతిరావు పూలే విద్యార్థులు. డి ఐ ఈ ఓ ను వివరణ కోరగా తమ నుండి ఎలాంటి తప్పు లేదని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచే సరి చేయాల్సి ఉందని వివరణ ఇచ్చారు. విద్యార్థులంతా వివిధ బీటెక్ కళాశాలల్లో చేరినప్పటికీ మెమోలు సరిగా లేకపోవడంతో కళాశాలల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే..కోరుకున్న భాగస్వామిని కోల్పోవాల్సి వస్తుంది

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోరుకున్న భాగస్వామిని కోల్పోవాల్సి వస్తుందని టాలీవుడ్ అగ్రతార సమంత పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్య సమస్యల కారణంగా సినిమాలకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఆరోగ్యం నిర్లక్ష్యం చెయొద్దంటూ చెప్పింది. మీరు మానసికంగా , శారీరకంగా ఆరోగ్యంగా లేనప్పుడు మీ భాగస్వామికి నచ్చినట్లు కనిపించలేరని ఆసమయంలో మనం భాగస్వామిని కోల్పోవాల్సి వస్తుందని సమంత అన్నారు. ప్రస్తుతం సమంత రక్త్ బ్రహ్మాండ్, మా ఇంటి బంగారం సినిమాలలో నటిస్తున్నారు. రక్త్ బ్రహ్మాండ్ వెబ్ సిరీస్ ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. మా ఇంటి బంగారం సమంత తన సొంత బ్యానర్లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ వేణు

**పెద్దపల్లి పెన్ పవర్:** ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి స్థానాలకు ఎన్నికలు మన పెద్దపల్లి జిల్లాలో పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. ఈ నెల 27న జిల్లాలో నిర్వహించనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ వేణు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతి ఒక్కరికి అనుభవం ఉందని, ఎక్కడా తేలికగా తీసుకోకుండా ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. మన పెద్దపల్లి జిల్లాలో ఉపాధ్యాయుల కోసం 14 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల కోసం 36 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, నిబంధనలు పాటిస్తూ పోలింగ్ సజావుగా జరపాలని అన్నారు. నామినేష న్ల ఉపసంహరణ ముగిసిన తర్వాత ఉపాధ్యాయ పోటీలో 19 మంది అభ్యర్థులు , పట్టభద్రుల స్థానానికి 56 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, వీటికి సంబంధించి బ్యాలెట్ పేపర్లు అవసరమైన మేర మనకు అందుబాటులోకి వస్తాయని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ అధికారులకు అవసరమైన మొదటి దశ శిక్షణ అందించా మని, శిక్షణకు గైర్హాజరైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, రెండవ దశ శిక్షణ




కార్యక్రమంలో అందరూ పాల్గొనేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓటర్ల జాబితా ప్రకారం బ్యాలెట్ బాక్స్ లో కేటాయించాలని , అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు అందుబాటులోకి పెట్టుకోవాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు విధులు నిర్వహించే రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. ఎన్నిక ల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరు డబ్బు మద్యం, ఆభరణా లు ,ఎలక్ట్రానిక్ పరికరాలు, గ్రైండర్లు, ఇస్త్రీ పెట్టెలు, ఇతర పరికరాల పంపిణీ చేయకుండా గట్టి నిఘా పెట్టాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన మేర మైక్రో అబ్జర్వర్లను కేటాయించా లని లీడ్ బ్యాంక్ మేనేజర్ కు సూచించారు. పెద్దపల్లి అమర్ నగర్ లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమై న టేబుల్స్, సిబ్బంది భోజనం, పబ్లిక్ అడ్రస్ సిస్టం, కుర్చీలు, టెంట్, త్రాగు నీరు ఇతర వసతులను రెవెన్యూ డివిజన్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం సంబంధించి బృందానికి పూర్తిస్థాయి ఎన్నికల సామాగ్రి అప్పగించా లని, ముందుగానే చెక్ లిస్ట్ తయారు చేసుకుని అవసర మైన ప్రతి ఒక్కటి అందిందో లేదో ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకోవాలని అన్నారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ రమాణాశాఖ అధికారికి సూచించారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాసనమండలి ఎన్నికల పోలింగ్ జరుగను న్నందని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద దివ్యాంగులకు అవసర మైన ఏర్పాట్లు చేయాలని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య బృందాల ను ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు ఒకసారి అంటే 10 గంటలకు, 12 గంటలకు, 2 గంటలకు, పోలింగ్ ముగిసిన తరువాత 4 గంటలకు పోలింగ్ వివరాలను ప్రకటించాలని అన్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటర్ స్లిప్పులు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని, 3.55 గంటలకు 4 గంటలకు పోలింగ్ ముగుస్తుందని ప్రకటించాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్ లో తరలింపునకు పోలీస్ ఎస్కార్ట్ ఉండాలని తెలిపారు. ఎన్నికల విధుల పట్ల ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశం లో రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా అటవీ అధికారి శివయ్య, కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్, రవాణా శాఖ అధికారి రంగారావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక స్వతంత్రతతోనే మహిళా సాధికారత...

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- భయాన్ని అధిగమిస్తూ కొత్త, కొత్త విషయాలను నేర్చుకుంటూ వ్యాపారాలను చేయాలి
- వ్యాపారవేత్త ఆలోచనా ధోరణి మహిళలు అలవర్చుకోవాలి
- వ్యాపార నైపుణ్య శిక్షణా శిబిరాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలి
- గ్రామీణ మహిళా వ్యాపార వేత్తలు, సెర్ఫ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రెండు రోజుల పాటు జిల్లాలోని 5 నియోజకవర్గాల గ్రామీణ మహిళా వ్యాపార వేత్తలు, సెర్ఫ్ సిబ్బందికి చిన్న తరహా వ్యాపారాల నైపుణ్యాభివృద్ధిపై స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొదటి రోజు మధిర, సత్తుపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలకి సంబంధించి నిర్వహించిన



శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,మహిళలకు ఆర్థిక బలం, ఆర్థిక స్వతంత్రత ఉంటేనే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం వల్ల కుటుంబాలు బాగుపడతాయని, పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు కూడా ఎదిగేందుకు నమ్మకం ముందు తరాలకు వస్తుందని అన్నారు.

వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు ధైర్యం ఉండాలని, ప్రారంభంలో మనకు వంద రకాల సందేహాలు, భయాలు ఉంటాయని వీటిని అధిగమిస్తూ కొత్త, కొత్త విషయాలను నేర్చుకుంటూ వ్యాపారాలను చేయాలని అన్నారు.

వ్యాపారాలు ఒకే రోజు విజయవంతం కావని, వ్యాపారాలు నడపడంలో నేర్పు, ప్రణాళిక ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఏ వస్తువు అధికంగా వ్యాపారం అవుతుంది, ప్రస్తుతం ఉన్న మార్కెట్ పరిధిలో వ్యాపారాన్ని ఎలా పెంచుకోవాలి, మన లాభం మార్జిన్ ఎంత ఉంటుంది వంటివి ఆలోచించి అడుగు వేయాల్సి ఉంటుందని అన్నారు. మన పరిసర ప్రాంతాలలో కస్టమర్ల ఆలోచనా సరళిని పరిశీలించి మన వ్యాపారాలు ఉండాలని అన్నారు. ఏ వస్తువుల విక్రయం వల్ల మనకు అధిక లాభం, వ్యాపారం అవుతుందో గమనించి జాగ్రత్తగా చేయాలని అన్నారు.

మన దగ్గర ఉన్న డబ్బును రెట్టింపు ఎలా చేయాలి అనే ఆలోచన నిరంతరం ఉండాలని, మనకు సరిపోతుంది అనే ఆలోచన ఉండవద్దని అన్నారు. చిన్న వ్యాపారాలు ప్రారంభించి గొప్ప స్థాయికి ఎదిగిన అనేక ఉదాహరణలు మన ముందు ఉన్నాయని అన్నారు.

జీవనోపాధి పెంపుదల, వ్యాపారాల నైపుణ్యాభివృద్ధికి అందించే శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, మహిళలకు అవసరమైతే అదనపు శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రపంచంలోనే గొప్ప దేశాలలో మన భారతదేశం ఒకటని, ఇందులో మతాలు, కులాలకు అతీతంగా మహిళలు కొంతమేర వెనుకబడి ఉన్నారని, సమాజంలో 50 శాతం ఉన్న జానాభా వర్క్ ఫోర్స్ లో రాణించకపోతే దేశ అభివృద్ధి కుంటుపడుతుందని

అన్నారు. మహిళలు సరైన అవకాశాలు లేక వెనకబడి ఉన్నారని, వారికి అవకాశాలు వస్తే అద్భుతంగా రాణించే క్షమత వారికి ఉందని అన్నారు. ఒక మహిళ అభివృద్ధి చెందితే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందినట్లు అవుతుందని, ధైర్యంగా ముందడుగు వేసి విజయవంతం కావాలని, మీ ధైర్యానికి, మీకు, మేము అండగా ఉంటూ, మీకు కావల్సిన సహకారం అందిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, అడిషనల్ డిఆర్డీవో నూరొద్దీన్, ఏ.ఎల్.ఈ.ఏ.పి. విజయవాడ రీజినల్ మేనేజర్ సునీత, ఐ.ఓ.ఎల్. ట్రైనర్ శివ నారాయణ, సి.హెచ్. రవీందర్, హైదరాబాద్ సేర్ఫ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.